

రాజన్నా శరణు..శరణు

వేములవాడ: రాజన్నను సోమవారం 40వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. - 8లో ▸



ఘనంగా వార్షికోత్సవం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బద్దెనపల్లి గురుకులంలో సోమవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మ, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీసీవో థెరిసా పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
38.0/24.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. పొద్దంతా వడ గాలులు, రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేతన్నలపై నిర్లక్ష్యం వీడాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు
- సిరిసిల్లలో నేతన్నల ఒక్కరోజు నిరాహార దీక్ష



సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్, వార్పిన్, వైపని కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు కోరారు. కూలీ పెంచాలని కోరుతూ నేతన్నలు సోమవారం ఒక్క రోజు నిరాహార దీక్షలు చేపట్టగా ప్రారంభించి మాట్లాడారు. కార్మికులకు మెరుగైన వేతనాలు వచ్చేలా ప్రభుత్వమే కూలి నిర్ణయించాలన్నారు. నేతన్నలు గత 7 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించే చీరల ఆర్డర్లకు సంబంధించిన కార్మికుల కూలీని నిర్ణయించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిరిసిల్లలోని నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి నేతన్నల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సంజయ్‌కు మత విద్వేషాలు రెచ్చగొట్టడమే తప్ప కార్మికుల సమస్యలు పట్టవని ఎద్దేవా చేశారు. కార్మికుల దీక్షకు బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు ఆరుకాల రమేశ్ తదితరులు సంఘీభావం తెలిపారు. దీక్షలో కోడం రమణ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, నక్క దేవదాస్, ఉడుత రవి, ఎలిగేటి శ్రీనివాస్, గుండు రమేశ్, బూట్ల వెంకటేశ్వర్లు, అవధూత హరిదాస్, బాస శ్రీధర్, మేకల బాలరాజు, కస్తూరి సతీశ్ కూర్చున్నారు.

19 నుంచి సమ్మెలోకి పంచాయతీ కార్మికులు

- డీపీవోకు సమ్మె నోటీసు అందజేత



సిరిసిల్ల: గ్రామపంచాయతీ కార్మికులు ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారని గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ సోమవారం తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి షరీఫొద్దీన్‌కు సమ్మె నోటీసు అందించామన్నారు. 2023 అక్టోబర్‌లో జరిగిన సమ్మె సందర్భంగా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వస్తే మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేస్తామని, కనీస వేతనం రూ.18వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతోనే సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. జీపీ కార్మికుల సంఘం నాయకులు బూర శ్రీనివాస్‌గౌడ్, అక్కల అంజాగౌడ్, వర్కోలు మల్లయ్య, లోకిని శ్రీనివాస్, పెంట రాజు, అశోక్, రవి, పల్నాటి బాబు పాల్గొన్నారు.

పల్లగుట్టను కాపాడండి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్, గూడూరు గ్రామాల మధ్య ఉన్న పల్లగుట్టను కాపాడాలని జిల్లా కలెక్టర్‌కు ముస్తాబాద్‌కు చెందిన సామాజికవేత్త చింతోజు బాలయ్య కోరారు. పదేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ నాయకులు పల్లగుట్టను రంగురాళ్ల కోసం లీజుకు తీసుకునే చర్యలను ఖండిస్తూ ప్రజాసంఘాలు ఉద్యమాలు చేశాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతను గమనించిన నాటి పాలకులు పల్లగుట్టను లీజుకు ఇవ్వలేదన్నారు. ఆరేళ్లుగా పల్లగుట్ట చుట్టూ తవ్వకాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లగుట్ట మట్టిని తవ్వేసి, చుట్టుపక్కల ఉన్న భూస్వాములు పల్లగుట్ట స్థలాన్ని తమ పొలాల్లో కలిపేసుకుంటున్నారన్నారు. పల్లగుట్టను యథేచ్ఛగా కొల్లగొడుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పదేళ్ల క్రితం ఉన్న వన్యప్రాణులు, నెమళ్లు నేడు గుట్టపై కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ విచారణ చేపట్టి పల్లగుట్టను కబ్జా నుంచి కాపాడాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ టాస్క్, ఈజీఎంఎం, మెప్మాతో గుర్తింపు పొందిన వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎంఏ భారతి ప్రకటనలో తెలిపారు. ఎంపికైన సంస్థలు రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ఎండీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో ఈ నెల 12లోపు కార్యాలయానికి చేరేలా దరఖాస్తులు పంపించాలని సూచించారు. వివరాలకు 99499 10328లో సంప్రదించాలని కోరారు.

సర్వర్ స్లో !

- దరఖాస్తులకు నిరీక్షణ.. మీసేవ కేంద్రాల్లో పడిగాపులు
- గడువు పెంచడంతో వెల్లువలా దరఖాస్తులు
- అందరూ ఒకేసారి లాగిన్ కావడంతో సైట్ స్లో
- దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు



ఇతను సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన వెంగల శ్రీకాంత్(36). బీఎస్సీ చదువుకున్నాడు. అమ్మ బీడీ కార్మికురాలు, నాన్న పవర్‌లూమ్‌వర్కర్. రాజీవ్ యువ వికాసంలో కిరాణషాపు పెట్టుకోవాలని నిర్ణయించుకున్నాడు. రూ.4లక్షల రాయితీ పథకానికి దరఖాస్తు చేసేందుకు కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్ల కోసం సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్‌కు వస్తే.. సైట్ స్లో ఉండడంతో సర్టిఫికెట్ల జారీ జాప్యమవుతోంది.



ఇది సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్‌లోని గిర్దావర్(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) చాంబర్. వివిధ సర్టిఫికెట్లపై ఆర్ఐ సంతకాల కోసం సిరిసిల్ల పట్టణ వాసులు నిరీక్షించాల్సి వస్తోంది. దరఖాస్తుదారుల వివరాలు, రేషన్‌కార్డు, గతంలో జారీ అయిన సర్టిఫికెట్లను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉంటే ధ్రువీకరిస్తున్నారు. కానీ ఒకేసారి అందరూ రావడంతో ఇలా ఇరుకుగదిలో దరఖాస్తుదారులు నిరీక్షించాల్సి వస్తోంది.



ఇది సిరిసిల్ల పట్టణంలోని ఆర్డీవో ఆఫీస్ పక్కనే ఉన్న మీసేవ కేంద్రం. ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేయడానికి గడువు పొడగించడంతో అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇలా మీసేవ కేంద్రంలో క్యూ కట్టారు. కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్లకు దరఖాస్తు ఫారాలు నింపి ఆన్‌లైన్ చేయడానికి వస్తే రెవెన్యూశాఖ సర్వర్ స్లోగా పనిచేస్తుంది. ఫలితంగా దరఖాస్తుదారులు గంటల తరబడి మీసేవ కేంద్రాల్లోనే నిరీక్షించాల్సి వస్తోంది.

సిరిసిల్ల: నిరుద్యోగ యువతీ, యువకులకు స్థానికంగానే స్వయం ఉపాధి అందించే లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల వారు స్థానిక ఎంపీడీవో ఆఫీస్‌లో, పట్టణాల్లోని వారు మున్సిపల్ ఆఫీస్‌ల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ సామాజిక వర్గాలకు చెందిన వారు అర్హులు. ఏప్రిల్ 14వ తేదీలోగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. గడువులోగా వచ్చిన దరఖాస్తులను మండల స్థాయి కమిటీ పరిశీలించి, అర్హుల జాబితాను జిల్లా కమిటీకి పంపిస్తుంది. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి బ్యాంకుల సహకారంతో రుణాలు అందిస్తారు. దరఖాస్తుల వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదార్ పాస్‌బుక్కు, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటో జతచేయాల్సి ఉంటుంది. వ్యవసాయేతర యూనిట్లకు 21–55 ఏళ్ల వారు, వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు 21–60 ఏళ్లు (2024, జూలై 1 నాటికి) ఉండాలి.

జిల్లాలో రాజీవ్ యువవికాసం ఇలా..
గ్రామాలు: 260, పట్టణాలు: 02
ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు : 5,391 (07.04.2025 నాటికి)
ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు : 664

ఇవీ రాయితీ వివరాలు

రూ.50వేలలోపు యూనిట్‌కు వందశాతం రాయితీ ఉండగా, రూ.లక్షలోపు యూనిట్‌కు 90 శాతం రాయితీ.. 10 శాతం బ్యాంకు లోను, రూ.2లక్షలలోపు యూనిట్‌కు 80 శాతం రాయితీ.. 20 శాతం బ్యాంకు లోను, రూ.4లక్షల యూనిట్‌కు 70 శాతం రాయితీ.. 30 శాతం బ్యాంకు లోను ఉంటుంది. బలహీనవర్గాల సమూహానికి యూనిట్లకు రూ.లక్ష వరకు వంద శాతం రాయితీ, చిన్ననీటిపారుదల యూనిట్‌కు వంద శాతం రాయితీ వర్తిస్తుంది.

ఇల్లంతకుంటలో అత్యధికం.. రుద్రంగిలో అత్యల్పం

రాజీవ్ యువవికాసం పథకానికి 5,391 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా ఇల్లంతకుంటలో 684, అత్యల్పంగా రుద్రంగిలో 56 దరఖాస్తులు వచ్చాయి. బోయినపల్లిలో 373, చందుర్తిలో 272, గంభీరావుపేటలో 525, కోనరావుపేటలో 496, ముస్తాబాద్‌లో 680, సిరిసిల్ల పట్టణంలో 303, తంగళ్లపల్లిలో 423, వీర్నపల్లిలో 177, వేములవాడ రూరల్‌లో 280, వేములవాడ అర్బన్‌లో 251, వేములవాడ మున్సిపల్‌లో 365, ఎల్లారెడ్డిపేటలో 506 దరఖాస్తులు వచ్చాయి.

సర్వర్ పని చేస్తలేదట



నేను 9వ తరగతి చదువుకున్న. మేం గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి ఉపాధి పొందాలని రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేయడానికి నిర్ణయించుకున్నాం. సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్ కేంద్రానికి వస్తే సర్వర్ సరిగా పనిచేయడం లేదు. గంటల కొద్దీ ఆన్‌లైన్ సెంటర్‌లోనే ఉండాల్సి వస్తోంది. సర్టిఫికెట్లు ఇంకా లేదు.
– అజ్మీరా సరిత, బావుసింగ్‌నాయక్‌తండా, వీర్నపల్లి

సైట్ స్లోగా పనిచేస్తుంది



గతంలో ఎన్నడూ లేనంత మంది సర్టిఫికెట్ల కోసం వస్తున్నారు. సైట్ స్లోగా పనిచేస్తుంది. ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు నమోదు చేయాలంటే సైట్ పనిచేస్తేనే సాధ్యం. రాజీవ్ యువ వికాసం, పై చదువులకు వెళ్లే విద్యార్థులు చాలా మంది వస్తున్నారు. సైట్ స్లోగా ఉండడంతో వేగంగా పని చేయలేకపోతున్నాం.
– కోడం ఉదయ్, మీసేవ కేంద్రం నిర్వాహకుడు, సిరిసిల్ల

రాత్రి ఒంటి గంట వరకు పనిచేస్తున్నారు



మా వద్ద పెండింగ్ ఉంచుకోవడం లేదు. మా లాగిన్‌కు వచ్చిన వాటిని వెంటనే క్లియర్ చేస్తున్నాం. అర్ధరాత్రి ఒంటి గంట వరకు మా సిబ్బంది పని చేస్తున్నారు. రోజుకు సగటున 300 నుంచి 500 దరఖాస్తులు వస్తున్నాయి. అన్నీ క్లియర్ చేస్తున్నా. ఇంకా మా వద్ద 800 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. అందరికీ ఆదాయం సర్టిఫికెట్ అవసరం లేదు. రేషన్‌కార్డు ఉంటే సరిపోతుంది. మీసేవ కేంద్రాల నిర్వాహకులు అందరూ ఒకేసారి లాగిన్ కావడంతో సర్వర్ స్లో అవుతుంది.
– సురభి మహేశ్‌కుమార్, తహసీల్దార్, సిరిసిల్ల

గ్యాస్ గుది‘బండ’!

- రూ.50 పెంపుతో రూ.925కు చేరిన సిలిండర్
- పాత జిల్లాలో 10లక్షలకుపైగా వినియోగదారులు
- ప్రజలపై రూ.5 కోట్లకుపైగా భారం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

మరోసారి వంటగ్యాస్ ధరలు పెరిగాయి. సోమవారం గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు ఏప్రిల్ 8 (నేటి నుంచి) అమలులోకి వస్తాయి. దీంతో ప్రస్తుతం రూ.875గా ఉన్న సిలిండర్ ధర సవరించిన ధర రూ.50లతో కలిపి రూ.925 కు చేరింది. ప్రస్తుతం రూ.503గా ఉన్న ఉజ్వల్ సిలిండర్‌కు కూడా పెంపు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. దీంతో ఉజ్వల్‌సిలిండర్ రూ.553కు చేరుకోనుంది. అంతర్జాతీయ కారణాలతో ధరలు పెరిగాయని చెబుతున్నా.. పండగపూట మాత్రం సామాన్యునికి ఇది భారమే కానుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 లక్షలకుపైగా ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సవరించిన సిలిండర్ ధరల ప్రకారం.. ఉమ్మడి జిల్లాపై ఏకంగా రూ.5 కోట్లకుపైగా భారం పడనుంది. అదే సమయంలో పెట్రోల్, డీజిల్‌పైనా రూ.2 ఎక్సైజ్ డ్యూటీ పెంచినా.. ఆ పెరుగుదల రిటైల్ ధరలో కలవదని, కాబట్టి వినియోగదారులపై రూ.2 భారం ఉండదని అధికారులు తెలిపారు. గతేడాది ఆగస్టులో చివరిసారిగా గ్యాస్ ధరలు పెరిగాయి.

మానేరులో ఆరు ఇసుక రీచ్‌లు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో కొత్తగా ఆరు ఇసుక రీచ్‌లను గుర్తించామని, స్థానిక అవసరాలకు, అభివృద్ధి పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పదిర, కొండాపూర్‌లో ఇసుక రీచ్‌లను మంగళవారం ప్రారంభించాలని ఆదేశించారు. ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. పదిర ఇసుక రీచ్ ప్రారంభించిన తర్వాత వెంకటాపూర్ రీచ్‌ను నిలిపివేయాలని తెలిపారు. వట్టిమల్ల అప్రోచ్‌రోడ్ సమస్యపై తహసీల్దార్ నివేదిక అందించాలని కోరారు. జిల్లాలో నిర్మించే ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధాభాయి, జిల్లా మైనింగ్ అధికారి క్రాంతికుమార్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫొద్దీన్, ప్రోగ్రాం అధికారి టీజీఎండీసీ పీవో జైపాల్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



సిరిసిల్ల: యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాస్ కోరారు. సిరిసిల్లలో సోమవారం ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో కూడిన జీవనంలో ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభించడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. మెడిటేషన్ దినచర్యలో భాగం కావాలని, విధిగా అలవాటు చేసుకోవాలన్నారు. ఐఎంఏ జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ లీలాశిరీష, వైద్యులు పద్మావతి, శోభారాణి, గీతావాణి, రజని, మెడిటేషన్ జిల్లా కోఆర్డినేటర్ కోడం సతీశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నిమ్మపల్లిలో పాదయాత్ర చేస్తున్న విప్ శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రారంభించినవేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని నిమ్మపల్లిలో సోమవారం చేపట్టిన ‘జైబాపు..జైభీమ్.. జైసంవిధాన్’లో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఉపాధిహామీ, గరీబీ హటావో, ఇందిరమ్మ ఇళ్లు, భూమిలేని నిరుపేదలకు పోడు భూములు, బ్యాంకుల జాతీయకరణ వంటి పథకాలు ప్రారంభించిందని గుర్తు చేశారు. వైఎస్సార్ హయాంలో వ్యవసాయానికి ఉచిత కరెంట్‌ను అమలు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలకు పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రూ.500 సిలిండర్, గల్ఫ్‌లో మరణించిన కార్మికులకు రూ.5 లక్షల పరిహారం ఇస్తున్నామని వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం జైసేవాలాల్ ఊరుతండాలో సన్నబియ్యం లబ్ధిదారు ఇస్లావత్ మధుకర్ ఇంటిలో భోజనం చేశారు. మండల కన్వీనర్ గడ్డం నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, మానుక సత్యం, బైరగోని నందూగౌడ్, చేపూరి గంగాధర్, శ్రీనివాస్, బండి ప్రభాకర్, మాజీ సర్పంచ్ బండ సత్తయ్య, సదానందం, దేవరాజు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- బీజేపీ, బీఆర్‌ఎస్‌లు చీకటి దోస్తులు
- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి



ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల: రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలో సోమవారం నిర్వహించిన ‘జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్’లో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ అని, రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేడ్కర్ ద్వారా అందించింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లు నియంతృత్వ, నిరంకుశపోకడలతో పాలన సాగించాయని విమర్శించారు. ఆ రెండు పార్టీలు చీకటి దోస్తులని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. 30 ఏళ్లుగా సమస్యగా ఉన్న ఎస్సీ వర్గీకరణ చేశారన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొడుతూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా భారత్ జోడో యాత్ర చేశారని గుర్తు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని రక్షించేందుకు అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. ఏఐసీసీ కోఆర్డినేటర్ అవేజ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపారెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, నాయకులు సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, ఆడెపు చంద్రకళ, కల్లూరి చందన, వైద్య శివప్రసాద్, రాగుల జగన్, గోలి వెంకటరమణ, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, భీమవరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజావాణిలో 155 అర్జీల స్వీకరణ



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: ప్రజావాణిలో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు పెండింగ్ పెట్టవద్దని సూచించారు. మొత్తం 155 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 51, సిరిసిల్ల మున్సిపల్ 9, డీఆర్డీఏకు 36, వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు 4, హౌసింగ్‌శాఖకు 14, ఉపాధి కల్పన శాఖకు 8, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌కు 1, పంచాయతీరాజ్ శాఖకు 15, విద్యాశాఖకు 12, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఎస్పీ ఆఫీస్, ఎస్‌డీసీకి ఒకటి చొప్పున, జిల్లా వైద్యాధికారికి 2 అర్జీలు వచ్చాయి. డీఆర్డీవో శేషాద్రి పాల్గొన్నారు.

ప్రభుత్వం నుంచి సాయం కావాలి



మా నాన్న లక్ష్మీరాజం చిన్నప్పుడే చనిపోయాడు. అన్న పాతికేళ్ల క్రితం కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. అప్పటి నుంచి వృద్ధురాలైన అమ్మను, నా భార్య, ఇద్దరు ఆడపిల్లలను సాదుకుంటున్నాను. ఇప్పుడు నాకు ఆరోగ్యం బాగాలేదు. ఇంటిని నడిపే శక్తిలేదు. మందులు కూడా కొనే పరిస్థితి లేని మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. – సింగం నర్సయ్య, గర్జనపల్లి

ఇల్లు ఇవ్వాలి



సిరిసిల్లలో చాలా ఏళ్లుగా కిరాయి ఇండ్లలో ఉంటున్నాం. రెండేళ్ల క్రితం డబుల్‌బెడ్‌రూమ్ అర్హులుగా ప్రకటించారు. ఇప్పటి వరకు మాకు ఇండ్లు కేటాయించలేదు. అద్దె ఇండ్లలో ఉంటున్నాం. కలెక్టర్ సార్ వెంటనే మాకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు అందించాలి.
– నాగుల స్వప్న, జి.లక్ష్మి, సువర్ణ, రేణుక

భూమికి హద్దులు పెట్టించాలి



మా ఊరి శివారులోని సర్వేనంబర్ 1137లో నిరుపేదలమైన 15 మందికి ప్రభుత్వం 2005లో ఒక్కొక్కరికి ఎకరం చొప్పున ఇచ్చింది. ఆ భూమిపై ఆధారపడి బతుకుతున్నాం. కొందరు భూస్వాములు మాభూములు వారివిగా పేర్కొంటున్నారు. ప్రభుత్వపరంగా హద్దులు ఏర్పాటు చేసి, న్యాయం చేయాలి.
– బర్ల వజ్రవ్వ, లక్ష్మి, రామవ్వ, పద్మ, రేణవ్వ

అద్దెకు ఇల్లు ఇవ్వడం లేదు



మేము సిరిసిల్లలోని పద్మనగర్‌లో 14 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. మాకు సొంతిల్లు లేదు. మా నాన్న ఆరోగ్యం బాగాలేదు. మాకు ఎవరూ ఇల్లు కిరాయికి ఇవ్వడం లేదు. డబుల్‌బెడ్‌రూమ్ ఇప్పించి మా కుటుంబానికి నీడ కల్పించాలి.
– నల్ల పోశవ్వ, రమేశ్, సిరిసిల్ల

ఇతరులకు పట్టా చేశారు



మాకు ఊరి శివారులో వంశపారపర్యంగా వచ్చిన భూమి ఉంది. దానిలో మేమే పంటలు వేస్తూ కాస్తులో ఉంటున్నాం. ఆ భూమిలో కొంత భాగం అధికారులు మరో ఇద్దరి పేరిట అక్రమంగా పట్టా చేశారు. ఈవిషయంలో ఇదివరకే చాలా సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదు. కలెక్టర్ సార్ స్పందించి సత్వర న్యాయం జరిపించాలి. – జి.సతీశ్‌రెడ్డి, వట్టెంల

ప్రొహిబిటెడ్ నుంచి తొలగించాలి



ముప్పై ఏళ్ల క్రితం ఎస్సీ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా మా గ్రామంలో 73 మందిమి ప్రభుత్వం నుంచి భూమిని కొన్నాం. 40 మందికి మాత్రమే పట్టాలు చేశారు. మరో 33 మందికి పట్టాలు ఇవ్వలేదు. మాకు ఇచ్చిన భూములు ప్రొహిబిటెడ్ పరిధిలో నుంచి తొలగించి న్యాయం చేయాలి.
– రామవ్వ, భారతి, యాదమ్మ, బద్దెనపల్లి

క్లుప్తంగా

అప్పల బాధతో ఒకరి ఆత్మహత్య


అలీ అహ్మద్ మృతదేహం

ధర్మపురి: ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఓ వ్యక్తి రాయపట్నం వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన మహ్మద్ అలీ అహ్మద్(45) కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, ఆదివారం ఇంటి నుంచి బయటికొచ్చాడు. ధర్మపురి మండలం రాయపట్నం చేరుకుని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు హసామ్ అహ్మద్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని ఒకరు..

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన అనుసూరి శ్యామ్‌సుందర్(46) సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామ్‌సుందర్‌కు అతని సోదరునికి మధ్య కొద్దికాలంగా భూ వివాదం కొనసాగుతోంది. భూపత్రాలు ఇవ్వడం లేదనే మనస్తాపంతో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

దుబాయ్‌లో అయిలాపూర్ వాసి మృతి


గాజర్ల శ్రీనివాస్ (ఫైల్)

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గాజర్ల శ్రీనివాస్(55) దుబాయ్‌లో ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్ గత 10ఏళ్లుగా జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి వస్తున్నాడు. రెండేళ్ల క్రితం సెలవుపై వచ్చి వెళ్లాడు. ఆదివారం ఉదయం తను ఉండే గదిలోనే గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య జల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. పెద్ద కూతురు లాస్యకు వివాహం కాగా చిన్న కూతురు రమ్య డిగ్రీ పూర్తి చేసింది, కుమారుడు రణధీర్ ఎంసీఏ చదివాడు. ఇంటి పెద్ద మృతి చెందటంతో శ్రీనివాస్ మృతదేహం కోసం ఎదురుచూస్తూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి..

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 5న స్థానిక పాత నటరాజ్ థియేటర్ సమీపంలో సుమారు 25ఏళ్ల యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారమందుకున్న 108 సిబ్బంది అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించాడు. అప్పటి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో ఉంచగా, అతని సంబంధీకులు ఎవరు రాలేదు. దీంతో మృతదేహాన్ని దహన సంస్కారాల నిమిత్తం సోమవారం మున్సిపల్ సిబ్బందికి అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్తంభంపల్లిలో ఒకరు..

వెల్గటూర్ : వెల్గటూర్ మండలం స్తంభంపల్లికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల రమేశ్(41)గత పదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 4న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య వనిత ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

రైలు నుంచి పడి వివాహిత..


ప్రతిభ రమేశ్‌గజ్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి వివాహిత మృతిచెందింది. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని రాజురా పట్టణానికి చెందిన వివాహిత ప్రతిభ రమేశ్‌గజ్ (46) వైద్యం కోసం కూతురు, సోదరుడితో కలిసి బల్హార్షా నుంచి సికింద్రాబాద్‌కు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. ఈ క్రమంలో జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త రమేశ్‌కోండ్‌గజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నిరుద్యోగ మహిళలు, యువతులకు ఈ ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ

చిగురుమామిడి: చిగురుమామిడి మండలంలోని నిరుద్యోగ యువతులు, మహిళలకు ఈ–ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ సోమవారం తెలిపారు. 18 నుంచి 45ఏళ్ల వయస్సున్న వారికి 60 రోజులపాటు ఎల్‌ఎండీకాలనీలోని దుర్గాబాయి మహిళా, శిశువికాస ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 50మంది నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన యువతులకు ఎలక్ట్రిక్ ఆటో నడపడంలో శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ లైసెన్సు జారీ చేస్తామన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

‘కేవీ’ పిలుస్తోంది

- ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 11వ తేదీ వరకు చివరి గడువు
- 2 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు ఉంటేనే అడ్మిషన్లు



కరీంనగర్: అధునాతన సాంకేతిక విద్యనందించే కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు వేళయింది. ఈనెల 2నుంచి అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాల సందడి మొద లైంది. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 2025–26 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు జారీ చేసిన నోటిఫికేషన్ విద్యాలయాలకు చేరింది. ఆన్‌లైన్ ద్వారా అర్హుల నుంచి దరఖాస్తు స్వీకరణ జరుగనుంది.

దరఖాస్తుల గడువు

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. ఈనెల 18 నుంచి తేదీ నుంచి అడ్మిషన్లు జరుగుతాయి. విద్యార్థులకు మెరిట్ జాబితా ప్రకారం ప్రవేశాలను కల్పిస్తారు. లిస్టులో ఉన్నవారు మాత్రమే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేంద్రీయ విద్యాలయంలో సంప్రదించి ప్రవేశాలను పొందాలి. ఒకటో తరగతిలో ప్రవేశానికి 2025 మార్చి 31వ తేదీ నాటికి ఐదేళ్ల వయస్సు నిండి ఏడేళ్ల వయస్సు కలిగి ఉండాలి. రెండో తరగతికి అరేళ్లు, 3వ తరగతికి ఏడేళ్లు, 4వ తరగతికి ఎనిమిదేళ్లు, 5వ తరగతికి తొమ్మిదేళ్లు, ఆరో తరగతికి పదేళ్లు, ఏడో తరగతికి 11 ఏళ్లు, ఎనిమిదో తరగతికి 12 ఏళ్లు, తొమ్మిదో తరగతికి 13, పదో తరగతికి 14 ఏళ్లు నిండి ఉండాలి. ఒక్కో కేంద్రీయ విద్యాలయంలో తరగతికి 40 చొప్పున సీట్లు ఉంటాయి. తాజాగా ఒకటో తరగతికి ప్రతి విద్యాలయంలో 40 చొప్పున ప్రవేశాలను నూతనంగా కల్పిస్తారు. ఆపై విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలనుకుంటే కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఉన్నత స్థాయి అధికారులు, కేంద్ర మానవ వనరులమంత్రిత్వ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

వీరికి ప్రాధాన్యం

ప్రవేశాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ రంగంలో పనిచేసే వారికి తొలి ప్రాధాన్యత ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల ఉద్యోగులు(ఆర్టీసీ, ఎన్‌పీడీసీఎల్, తదితర) ఒకే సంతానం కలిగిన కుటుంబాల్లోని వారికి ప్రాధాన్యం ఉంటుంది. పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ, కేవీఎస్ ఉన్నతాధికారులు సిఫార్సు చేసిన విద్యార్థులకు ప్రవేశాల్లో ప్రాధాన్యం కల్పిస్తారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో 100 మార్కులకు పరీక్ష రాయాలి. హిందీ, ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ పాఠ్యాంశాల్లో ఈ పరీక్ష ఉంటుంది. 100 మార్కులకు ఇతరులు కనీసం 33, ఎస్సీ,ఎస్టీ దివ్యాంగులు 25 మార్కులు సాధించాలి. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ప్రతిభ ఆధారంగా చేపడతారు. ఎస్సీలకు 15 శాతం(12 సీట్లు), ఎస్టీలకు 7.5 శాతం(6 సీట్లు), 3 శాతం సీట్లను దివ్యాంగులకు రిజర్వు అవుతాయి. మిగిలిన సీట్లు ఇతరులకు కేటాయిస్తారు.

ఫీజు వివరాలు

అడ్మిషన్ పొందే విద్యార్థులు రూ.25 ప్రవేశ రుసుం చెల్లించాలి. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థి వరకు నెలకు రూ.500 చెల్లించాలి. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కంప్యూటర్ బోధన కోసం అదనంగా నెలకు రూ.100 చెల్లించాలి. 9వ, 10వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద అదనంగా నెలకు రూ.200 చెల్లించాలి. 11,12వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద అదనంగా నెలకు రూ.400 చెల్లించాలి.

సీటు లభిస్తే దశ తిరిగినట్లే

సీబీఎస్ఈ సిలబస్‌లో కేంద్రీయ విద్యాలయాల్లో బోధన ఉంటుంది. పిల్లలపై ఎటువంటి ఒత్తిడి లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తారు. ఒకటో తరగతి నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో పరిచయం, శాస్త్ర సాంకేతికపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు ఉంటాయి. మిగిలిన పాఠశాలలకు భిన్నంగా దీని పనివేళలు, సెలవులు ఉంటాయి. ఆటపాటలు, స్వేచ్ఛతో కూడిన విద్య అందుతుంది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ స్కూల్స్‌ల్లో 9వ తరగతిలో ప్రవేశానికి ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుంది.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: ముగ్గురు పిల్లలున్న వివాహితపై కన్నేసి, మాట వినకుంటే కిరోసిన్ పోసి నిప్పంటించి, ఆమె మృతికి కారణమైన నిందితుడు ఇల్లంతకుంట శ్రీధర్‌కు యావజ్జీవ శిక్ష, రూ 1.02 లక్షల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. పీపీ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం కొడిమ్యాలలో నివాసం ఉండే దంపతులకు ముగ్గురు పిల్లలు. భర్త ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. భార్య బీడీలు చుడుతూ పిల్లలను చదివిస్తోంది. వీరి ఇంటి పక్కన ఉండే ఇల్లంతకుంట శ్రీధర్ సదరు మహిళపై కన్నేశాడు. కోరిక తీర్చకపోతే చంపుతానని బెదిరించాడు. దీంతో సదరు మహిళ తన పిల్లలతో కలిసి అదే గ్రామంలో వేరే చోటుకు అద్దె ఇంట్లోకి మారింది. అక్కడికి వెళ్లిన శ్రీధర్ మహిళకు ఇల్లు ఎందుకు అద్దెకిచ్చావని యాజమానితో గొడవకు దిగాడు. దీంతో ఆ మహిళ తిరిగి సొంతింటికి వచ్చింది. ఏప్రిల్ 14, 2019 రోజున సదరు మహిళ ఇంట్లో బీడీలు చుడుతుండగా, శ్రీధర్ వచ్చి తన కోరిక తీర్చమని వేదించాడు. ఒప్పుకోకపోవడంతో తన ఇంట్లోంచి కిరోసిన్ తీసుకొచ్చి ఆమెపై పోసి నిప్పంటించాడు. ఈ సమయంలో మహిళ పిల్లలు గ్రామంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని తిరిగి వస్తుండగా, ఇంట్లోంచి కేకలు వినపడ్డాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పివేస్తుండగా శ్రీధర్ అక్కడి నుంచి పారిపోయాడు. సదరు మహిళను జగిత్యాలకు తరలించి, అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐలు సీహెచ్.నాగేందర్, కె.కిశోర్ కేసు నమోదు చేసి, శ్రీధర్‌ను అరెస్ట్ చేసి, చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కేవీ.సాగర్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో, పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడైన ఇల్లంతకుంట శ్రీధర్‌కు యావజ్జీవ శిక్షతోపాటు రూ.1.02 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ద్విచక్రవాహనం దహనం


కాలిపోయిన ద్విచక్రవాహనం

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఓ యువకుడు తన తాతకు చెందిన ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టాడు. ఈ ఘటనలో బైక్ పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే మరిపెల్లి లింబయ్య ఆదివారం తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట నిలిపి, ఇంట్లో నిద్రించాడు. తన మనవడు మరిపెల్లి లింబాద్రి రాత్రి 10గంటల ప్రాంతంలో మద్యం సేవించి వచ్చి, ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఇంట్లో నిద్రిస్తున్న లింబయ్య బయటకు వచ్చే సరికే బైక్ పూర్తిగా కాలిపోయింది. లింబయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామానికి చెందిన గంగిపెల్లి నాగరాజు ఈనెల 1న కొత్తబస్టాండ్‌లో బైక్ నిలిపి కళాశాలకు వెళ్లి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని దొంగలు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మధరావు తెలిపారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: వాతావరణ శాఖ ఈదురు గాలులు, భారీ వర్షాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. సోమవారం హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంనుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తూ ఏదైనా అంతరాయం జరిగితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడితే, ట్రిప్పింగ్స్, బ్రేడౌన్‌లు సంభవిస్తే త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల కోతలు జరుగుతున్నందున పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సమయంలో కావాల్సిన మెటీరియల్‌ను సమకూర్చుతామన్నారు. వ్యవసాయానికి అవసరమైన చోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి సర్కిల్‌లో ఎల్‌సీ యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ టి.సదర్‌లాల్, జీఎంలు, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



రాజన్నా శరణు.. శరణు

వేములవాడ: రాజన్నను సోమవారం 40వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. కల్యాణోత్సవం విజయవంతం కావడంతో ఆలయ ఉద్యోగులు ఈఈవో కొప్పుల వినోద్‌రెడ్డిని శాలువా కప్పి సత్కరించారు. ఏఈవోలు అశోక్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.





దుబాయ్‌లో మూడో వ్యక్తి ?

- బంగారం సంఘటనలో మరో ట్విస్ట్
- ఆందోళనలో బాధిత కుటుంబం

చందుర్తి(వేములవాడ): విదేశీ బంగారంను మాయం చేసిన కేసులో నిందితుడుగా భావిస్తున్న చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన ఏనుగుల నాగరాజు ఉరఫ్ నాని పోలీసుల కళ్లుగప్పి దుబాయ్ పరారైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన తుంటి భీరయ్య, గడ్డం అనిల్ సౌదీ అరేబియా నుంచి 400 గ్రాముల బంగారంను ఇండియాకు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో ఫ్లైట్ దిగిన తర్వాత సమీప బంధువు చేతిలో మోసపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితునిగా భావిస్తున్న వెంకటేశ్ సౌదీలో ఉండగా.. పరారీలో ఉన్న నాగరాజు కోసం పోలీసులు రెండు బృందాలుగా వీడిపోయి గాలిస్తున్నారు. కాగా అతను గల్ఫ్ వెళ్లినట్లు ప్రచారంలో ఉంది.

భయాందోళనలో బాధిత కుటుంబాలు

సౌదీ అరేబియా నుంచి ఒప్పందం ప్రకారం బంగారం తీసుకొచ్చిన భీరయ్య, అనిల్ మూడో వ్యక్తి చేతిలో మోసపోయారు. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 5న రిమాండ్‌కు తరలించారు. భీరయ్య, అనిల్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఇంటికొచ్చారు. కాగా సౌదీ అరేబియా నుంచి బంగారం పంపించిన వారి నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని భీరయ్య తండ్రి కంటితడి పెడుతున్నాడు. జైలులో ఉంటేనే తమ వారు క్షేమంగా ఉంటారనే భావన బాధిత కుటుంబ సభ్యులు భావిస్తున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. కాంట్రాక్ట్‌పై బంగారంను ఎయిర్‌పోర్టులో అధికారుల కన్నుగప్పి బయటకు తీసుకొచ్చిన తర్వాత తెలిసిన వ్యక్తి చేతిలో మోసపోవడం కొసమెరుపు. కాగా సదరు మూడో వ్యక్తి దుబాయ్ చెక్కేశాడనే చర్చ స్థానికంగా జోరందుకుంది.

రూ.10లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం

- ఎనిమిది రోజులు మృత్యువుతో పోరాటం
- గాయపడ్డ యువకుడి మృతి
- నారాయణపూర్‌లో విషాదం


అవేజ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు ఎనిమిది రోజులు మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. యువకుడి ప్రాణాలు కాపాడుకోవడానికి తల్లిదండ్రులు రూ.10లక్షలు ఖర్చు చేసినా ప్రాణాలు దక్కలేదు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో విషాదం నింపింది. ఎస్సై రమాకాంత్, గ్రామస్తులు తెలిపిన వివరాలు. నారాయణపూర్‌కు చెందిన షేక్ అవేజ్(18) గత నెల 30న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఆదివారం రాత్రి మృతి చెందాడు. రంజాన్ పండుగకు ముందు రోజు సిరిసిల్లలోని ఓ టైలర్‌లో కుట్టించిన కొత్త బట్టలు తీసుకురావడానికి తన మిత్రుడు షేక్ అఫ్రోజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అవేజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఏడు రోజులపాటు చికిత్స అందించారు. ఒక్కగానొక్క కొడుకును కాపాడుకోవడానికి తల్లిదండ్రులు అప్పు చేసి వైద్యం అందించారు. అయినా ప్రాణాలు దక్కకపోవడంతో తండ్రి సమద్, తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గాయపడ్డ మరో యువకుడు అఫ్రోజ్ చికిత్స పొందుతున్నాడు. మృతుని కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి తదితరులు పరామర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అవేజ్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు

తల్లీకొడుకుల మృతితో రుద్రంగిలో ఉద్రిక్తం


ఇంటివద్ద మోహరించిన పోలీసులు


ఆందోళనకారులను సముదాయిస్తున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్

- అనుమానితుల ఇంటిపై మృతురాలి కుటుంబీకుల దాడి
- సముదాయించిన పోలీసులు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగికి చెందిన తల్లీకొడుకులు కాదాసు పుష్పలత, నిహాన్ మృతితో మండల కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అత్తమామలే విషమిచ్చి చంపారంటూ మృతురాలి తల్లిగారి కుటుంబ సభ్యులు పుష్పలత అత్తమామల ఇంటిపై సోమవారం దాడి చేశారు. వారి మృతికి కారకులను శిక్షించాలని కోరుతూ ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో ధర్నాకు యత్నించారు. బాధితులకు న్యాయం చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్షిస్తామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు చేపట్టారు. పుష్పలత భర్త దుబాయ్ నుంచి మంగళవారం వస్తుండడంతో అంత్యక్రియలు సోమవారం జరుపలేదు. పుష్పలత మృతదేహాన్ని వేములవాడ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి వచ్చిన మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 0878–2268686 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పరుగెత్తితే పతకమే..

- క్రీడా పోటీల్లో ‘మోడల్’ విద్యార్థుల సత్తా
- రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్న చిన్నారులు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): వాళ్లు పల్లెవాసులు.. క్రీడా నేపథ్యం లేని కుటుంబాల నుంచి వచ్చారు.. ఎక్కడా తర్ఫీదు కూడా తీసుకోలేదు.. కానీ, చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తూ ఔరా అనిపిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు ధర్మారం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు. పీఈటీ కొమురయ్య, ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ప్రోత్సాహంతో మెలకువలు నేర్చుకుంటున్నారు. ఈ విద్యాలయం నుంచి ఏటా 40 నుంచి 50 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి, ఐదుగురు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. 2024–25 సంవత్సరంలో జాతీయస్థాయి పోటీలకు ఆరుగురు విద్యార్థులు హాజరవుతున్నారు. ఈ విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన క్రీడాకారులతో తలపడి అద్భుత రికార్డులో నమోదు చేస్తున్నారు. వివిధ పట్టణాలు, నగరాల్లో నిర్వహించే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు సొంత ఖర్చులతోనే వెళ్తూ పతకాలు సాధిస్తున్నారు.

వాలీబాల్‌లో సత్తా



ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న సింధూ అండర్–19 వాలీబాల్ పోటీల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ విజయవాడలో నిర్వహించిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటింది.

– బి.సింధూ

పట్టుదలతోనే



ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న శరణ్య రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్–19లో మణిపూర్ రాష్ట్రంలోని ఇంపాలో ఈనెల 15 నుంచి 21 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది.

– బైకని శరణ్య

ఆనందంగా ఉంది



తొమ్మిదో తరగతి చదువుతున్న మనోజ్ఞ ఎస్‌జీఎఫ్ అండర్ –17లో ఇటీవల మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జమ్ముకాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటడం ఆనందంగా ఉంది.

– తుమ్మల మనోజ్ఞ

పట్టుదలతోనే సాధ్యం



పీఈటీ ప్రోత్సాహంతో సాఫ్ట్‌బాల్‌పై ఆసక్తి పెంచుకున్న. పట్టుదలతో ఆడుతూ రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీలకు చేరుకున్న. మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాణించడం సంతోషంగా ఉంది.

– బండి వైష్ణవి

జాతీయ స్థాయిలో ప్రతిభ



ఎనిమిదో తరగతి చదువుతున్న ఓరం సొజ్జ అథ్లెటిక్స్ అండర్ –14లో జాతీయ స్థాయికి ఎదిగింది. ఆమె పరుగెత్తితే పతకం ఖాయం. రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగి గుజరాత్ హమ్మదాబాద్‌లో జరిగిన పోటీల్లో సత్తాచాటింది.

– ఓరం సొజ్జ